దేశ సంక్షేమం కోసం పనిచేసే పార్టీ బీజేపీ

ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్



భోలక్‌పూర్ దేవీచౌక్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న బిజ్జి కనకేష్‌కుమార్

ముషీరాబాద్: దేశ సమగ్రత, సమైఖ్యత కోసం పని చేసే పార్టీ బీజేపీ అని ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని దేవీచౌక్ వద్ద నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకొని ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలన్నారు. ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే బీజేపీకి ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు ఇచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు సభ్యత్వ నమోదు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు.

◆ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా పది కోట్ల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంలో భాగంగా తమ ప్రాంతంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదును పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే విధంగా సైనికుల్లా పని చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం, అధికార ప్రతినిధి చంద్రమోహన్, నగర నాయకులు నిత్యానంద్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, భోలక్‌పూర్ అధ్యక్షుడు రవి కుమార్, నాయకులు శివకుమార్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తరలించాలి

మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు

- స్పందించకుంటే చెత్తను తీసుకొచ్చే వాహనాలను అడ్డుకుంటాం
- జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ హెచ్చరిక



మాట్లాడుతున్న జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ నేతలు

కవాడిగూడ: నగరంలోని దమ్మాయిగూడలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డును నగర నలుమూలలకు తరలించి తమను కాపాడాలని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని వెంటనే నిలబెట్టుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో తమ ప్రాంతాలకు చెత్తను తీసుకొచ్చే వాహనాలు, చెత్త రిక్షాలను ఎక్కడికక్కడ అడ్డుకొని నగరాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

◆ జవహర్‌నగర్ డంపింగ్ యార్డును వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద డంపింగ్ యార్డు బాధితులు పెద్ద ఎత్తున ధర్నా నిరసన వ్యక్తం చేశారు. దమ్మాయిగూడలో ఉన్న ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి పట్టదా గత అనేక సంవత్సరాలుగా డంపింగ్ యార్డు అనేక ఇబ్బందులు పడుతున్నామని కలుషిత తాగునీరు వివిధ రకాల రోగాల భారిన పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

◆ ఈ సందర్భంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నిరసన దీక్ష సన్నాహక కమిటీ కన్వీనర్లు గోగుల రామకృష్ణ, కేతుపల్లి పద్మాచారి, మారెం సమ్మిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సందీప్, గవ నివ్వర మాట్లాడారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసిన నాటి నుంచి 15ఏళ్లుగా స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ నేతలు ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు.

◆ ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిలు స్పందించి జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని వారు హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడానికే వందలాదిమంది బాధితులు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తున్నట్లు వారు వివరించారు.

పోలీసులను ప్రశ్నించినందుకు చేయి విరగ్గొట్టారు!

- దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- బీఆర్‌ఎస్, దళిత సంఘం నేతలతో కలిసి ఫిర్యాదు



ముషీరాబాద్ రాణా ఆవరణలో బాధితుడు

ముషీరాబాద్: రోడ్డుపై నిలుచున్న వ్యక్తిని ముషీరాబాద్ పోలీసులు అకారణంగా దాడి చేశారు. పోలీసుల దెబ్బలకు బాధితుని చేయి విరగడంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం బాధితుడు ముషీరాబాద్ బీఆర్‌ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి సత్యనారాయణబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని స్నేహితుడు తీసుకెళ్లడంతో వాహనం కోసం వినోభానగర్‌లోని తన ఇంటి సమీపంలో రోడ్డుపై నిలుచొని ఉన్నానని తెలిపారు.

స్నేహితుడి కోసం నిల్చున్నానని చెబితే...

◆ పార్సిగుట్ట నుంచి వినోభానగర్ వైపు వెళ్తున్న పోలీసులు ఇక్కడ నిలబడొద్దని సూచించారు. తన స్నేహితుడి కోసం నిల్చున్నానని చెబితే అయినా వెళ్లిపోవాలని దురుసుగా మాట్లాడారని అన్నారు. పక్కనున్న బార్‌ను మూయించరు కానీ తనను దబాయిస్తారేందని ప్రశ్నించినందుకు తనపై విచక్షణ రహితంగా లాఠీలతో కొట్టారన్నారు. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి వెళ్లానని తెలిపారు. వైద్యులు పరీక్షలు చేసి చేయి విరిగిందని చెప్పారన్నారు.

ఏఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి...

◆ ఆదివారం ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్ బాధితుడు సత్యనారాయణ బాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం బాధితుడిని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఇన్‌స్పెక్టర్ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ బాబుపై దాడి చేసిన ఏఎస్‌ఐ మోహన్‌రావు, ఇద్దరు కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేయాలన్నారు. వారిని సస్పెండ్ చేయని పక్షంలో స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

అవయవదాన ప్రాముఖ్యతను తెలుసుకోవాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఈశ్వర లింగంను సన్మానిస్తున్న ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతి ఒక్కరూ అవయవదాన ప్రాముఖ్యతను తెలుసుకోవాలని అమ్మ ఐ అండ్ ఆర్గానిక్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వర లింగం అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ 8వ వార్షికోత్సవం సందర్భంగా అవయవదానం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంజి ఈశ్వరలింగం మాట్లాడుతూ... అవయవదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడి కొత్త జీవితాన్ని ప్రసాదించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఒక అవయవదాత దాదాపు ఏడుగురు ప్రాణాలను కాపాడగలరని వైద్యనిపుణులు చెబుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదాని ప్రాముఖ్యతను తెలుసుకొని ఇతరులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం వల్ల లక్షలాది మంది ప్రాణాలను కాపాడడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు తమ సంస్థ ద్వారా 1569 నేత్రాలను సేకరించి వందలాది మందికి కంటి చూపును ప్రసాదించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ సుబ్బరాజు, జోత్స్న, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేందర్‌కు విష్ ఫౌండేషన్ అచీవర్స్ అవార్డు



కాచిగూడ: నిరుపేదలకు తనవంతు న్యాయ సహాయ, సహకారాలు అందిస్తున్న బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన ఎన్‌ఈ మహేందర్‌కు విష్ ఫౌండేషన్ అచీవర్స్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా విష్ ఫౌండేషన్ చైర్మన్ బి.మదన్‌మోహన్ తదితరులు పాల్గొని మహేందర్‌ను సన్మానించారు.

మన్‌కీ బాత్ విన్న కేంద్రమంత్రి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి, జయశ్రీ, కార్పొరేటర్లు కన్నె ఉమా, కార్పొరేటర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియోపతి వైద్య శిబిరానికి స్పందన

నల్లకుంట: స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠం మార్కెట్ రోడ్డు సమీపంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. దీనికి హాజరైన కాంగ్రెస్ సీనియర్ ప్రవాస భారతీయుడు ఎస్. హరినాథ్‌రెడ్డిని నిర్వాహకులు శాలువాతో సన్మానించి వివేకానందుడి బోధనల పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామలింగేశ్వరరావు, హరినాథ్, డాక్టర్ ఆర్‌వీ. కృష్ణమూర్తి, రమేష్, ఆర్‌వీ. అప్పారావు, కె. శ్రీనివాస్ రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



హరినాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

న్యాయవాదుల సేవలు చిరస్మరణీయం

ఏపీ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (జీపీ) వివేకానంద



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వివేకానంద

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: న్యాయవాదుల సేవలు చిరస్మరణీయమని వాటిని వెలకట్టలేమని ఏపీ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (జీపీ) వివేకానంద అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో బ్రాహ్మణ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన కేవీ సత్యనారాయణ వి.పరబ్రహ్మ శాస్త్రి, పి.యాదగిరిరావు, టీఎస్ ఆనంద్, అడ్వకేట్ల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివేకానంద మాట్లాడుతూ... బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు సమాజహితమే లక్ష్యంగా చేపట్టిన సేవా కార్యక్రమాలు అనేకం ఉన్నాయన్నారు. వివిధ కేసుల్లో బాధితులకు ఉచితంగా న్యాయసేవలు అందించి న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదుల ఎల్.రవిచందర్, అంబడిపూడి సత్యనారాయణ, గిరిధర్‌రావు, చెల్లా ధనుంజయ్, సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఎస్పీ సరేష్ కుమార్, ప్రభుత్వ న్యాయవాది మహేష్, బార్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కటౌట్ దగ్ధం.. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

- చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య
- ఎన్టీఆర్ కటౌట్ దగ్ధం విషయంలో కేసు నమోదు



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌లో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా రిలీజయ్యింది. అభిమానులు సంబురాలు జరుపుకుంటున్న సమయంలో ఎన్టీఆర్ కటౌట్ దగ్ధమైన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆదివారం థియేటర్ మేనేజర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో సినిమా థియేటర్‌లో అనుమతులు లేకుండా బాణసంచాలు కాల్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

10 నుంచి సాయిబాబా పుణ్యతిథి మహోత్సవాలు



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో అక్టోబర్ 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సాయిబాబా పుణ్యతిథి మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. అక్టోబర్ 10 తేదీన ఉదయం 10గంటలకు షిరిడీ సాయిబాబా పారాయణ బృందంచే శ్రీలలితా సహస్ర నామార్చనతో కుంకుమ పూజ ఉంటుందన్నారు. అక్టోబర్ 11వ తేదీన నిత్య పూజలు ఉంటాయన్నారు. 12వ తేదీన ఉదయం 5గంటలకు నగర సంకీర్తన అనంతరం బాబాకు కాకడ హారతి, 8 గంటలకు అన్నదానం అనంతరం శ్రీసాయి సచ్చరిత్ర పఠనం ఉంటుందని చెప్పారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు జమ్మి పూజ, 5.30 గంటలకు 106 దీపాల అలంకరణం ఉంటుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మరుసటి రోజు వరకు ఆలయం తెరిచే ఉంటుందన్నారు.

◆ 13న ఉదయం కాకడ హారతి అనంతరం బాబాకు అభిషేకం (మంగళ స్నానం), అర్చన, సాయి సహస్ర నామార్చన, ఉదయం 8గంటలకు అన్నదానం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6గంటలకు ధూప్ హారతి, అనంతరం భజన, ఊయల సేవ, శేజ్ హారతితో పుణ్యతిథి మహోత్సవాలు ముగుస్తాయని సంస్థాన్ ప్రతినిధులు పేర్కొన్నారు. పుణ్యతిథి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రతినిధులు కోరారు.

కుల, మతాంతర వివాహాలు చట్టబద్ధమే..

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ రాధారాణి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులాంతర, మతాంతర వివాహాలు చట్టబద్ధమేనని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడలేని విధంగా కులవ్యవస్థ కేవలం భారతదేశంలో ఉందన్నారు. ఈ కులం అనేది క్యాన్సర్ కంటే అత్యంత ప్రమాదకరమైనదని అన్నారు. ఒక వైపు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంటే మరోవైపు కులాధిపత్యంతో దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతుల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఎస్.వినయ్‌కుమార్, కేవీపీఎస్ కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, కుల నిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండీ వాహీద్, కృష్ణచంద్, సుబ్బారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం కాల్చివేసిన ఘటనపై విచారణకు త్రిసభ్య కమిటీ



టీపీసీసీ అధ్యక్షుడికి నివేదిక సమర్పిస్తున్న త్రిసభ్య కమిటీ చైర్మన్ అచ్యుత రమేష్‌బాబు

ముషీరాబాద్: సిద్ధిపేట జిల్లా ములుగు మండలం దాసరపల్లి గ్రామంలో దళిత కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న వినాయక మండపాన్ని కాల్చివేసిన సంఘటనపై విచారణ జరిపేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటయ్యింది. అచ్యుత రమేష్‌బాబు నేతృత్వంలో జల్పల్ నరేంద్ర, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ సభ్యులుగా ఒక త్రిసభ్య కమిటీని దళిత విభాగం అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగిరిగారి ప్రీతం ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి కమిటి దానికి సంబంధించిన పూర్తి నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సమర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ అచ్యుతరమేష్‌బాబు, సభ్యుడు నరేందర్ పాల్గొన్నారు

పేదలకు న్యాయ సేవలను ఉచితంగా అందించాలి



గంగపుత్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: గంగపుత్రుల హక్కుల పరిరక్షణకు న్యాయవాదులు కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తెలంగాణ గంగపుత్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం చిక్కడపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. గంగపుత్రులు కలసికట్టుగా ఉంటేనే రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించగలరని అన్నారు. న్యాయవాదులంతా పేదలకు న్యాయపరమైన సేవలను ఉచితంగా అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గోపాల్‌ను న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, కామారెడ్డి కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి, న్యాయవాదులు పాక సాయిసంతోష్, పూసమల్లేష్, దేశబోయిన రఘు, భూపతి. పల్లి కొండ అరవింద్, భాస్కర్ పాల్గొన్నారు.

మహావీర్ త్యాగమార్గాన్ని ఎంచుకోవడం గర్వకారణం



దీక్ష తీసుకున్న ముముక్షు సంగీతాదేవి పితాలియా, కుమారుడు విజయేంద్రజీ పితాలియా

కవాడిగూడ: మహావీర్ త్యాగ మార్గాన్ని ఎంచుకోవడం ఎంతో గర్వకారణమని శ్రీసాధు మార్గ్ జైన్‌సంగ్ అధ్యక్షుడు వికాచంద్ పితాలియా, కార్యదర్శి విజయరాజు మొనోతు అన్నారు. ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్ గోషాలలో జరిగిన కార్యక్రమంలో ముముక్షు సంగీతాదేవి పితాలియా, కుమారుడు విజయేంద్రజీ పితాలియా దీక్ష తీసుకున్న సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అక్టోబర్ 7వ తేదీన రాజస్థాన్‌లోని బిల్వారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగే శ్రీ జైన భగవతి దీక్ష మహోత్సవంలో ఈ దీక్షను తీసుకున్నట్లు వారు చెప్పారు.

◆ ఈ దీక్ష తీసుకున్నవారు నాలుగు నెలల పాటు ఆశ్రమంలో ఉంటారన్నారు. ఆ తరువాత ఎనిమిది నెలలపాటు దేశ సంచారం చేస్తారని అన్నారు. కుల, మత బేదాలు లేకుండా శాఖాహారుల ఇళ్లలో బిక్షాటన చేస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వికాస్ పితాలియా, విజయ్‌మొనోత్, వినోద్‌పితాలియా, ప్రేమలత పితాలియా, రాఖీగాంధీ, సుశీల కరారియా, రేఖాసానావత్, నిధి శ్రీశ్రీమల్, రాజేష్‌రాంకా, వినోద్ సానావత్, జినేష్ సంక్లా, హరియంత్ సబారియా, ప్రతీక్‌జైన్, రాజేష్‌జైన్, అవస్‌సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సరైన జీవన విధానంతో గుండె జబ్బులకు చెక్



బాపునగర్‌లో గుండె వ్యాధుల నివారణ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రగతినికేతన్ విద్యార్థులు

అంబర్‌పేట: వాతవరణంలో మార్పులు, ఆహారపు అలవాట్లు, గుండె సంబంధిత వ్యాధిన బారిన పడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని సాధన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ మోహన్ తెలిపారు. ఆదివారం ప్రపంచ గుండె పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబర్‌పేట డివిజన్ బాపునగర్‌లో ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ వారు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గుండె జబ్బుల నుంచి బయట పడేందుకు సరైన జీవన శైలినే మెరుగైన మార్గం అన్నారు. సరైన అవగాహన కలిగి ఉంటే గుండె జబ్బుల బారిన పడకుండా ఉండొంచ్చన్నారు. ప్రతి మనిషికి సరైన వ్యాయమం, నిద్ర, ఒత్తిడిలేని జీవన విధానం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా. నారాయణ ముదిరాజ్, ప్రతినిధులు భక్తుల హనుమంతు, శ్రీనివాస్‌రావు, పాఠశాల చైర్మన్ మధుసూదన్, ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒత్తిడితో గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం

ముషీరాబాద్: ఒత్తిడి ఎక్కువయితే గుండెపోటు వచ్చే అవకాశం ఉందని సీనియర్ అడ్వకేట్ డాక్టర్ పి.స్వరూపారాణి అన్నారు. ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకోని డా. హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఒత్తిడితో గుండెపోటు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు విటమిన్ ట్యాబ్‌లెట్లు, పోషకాహారం, పుస్తకాలు అందజేశారు. అనంతరం డాక్టర్ స్వరూపారాణి మాట్లాడుతూ.. ఒత్తిడి గుండె పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఒత్తిడి గుండెపోటుకు దారి తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, ఎస్.గోపాలకృష్ణ, జి.కృష్ణవేణి, జ్యోతిరాజా, రెయిన్‌బో హోం ఇన్‌చార్జి సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో బాలికలకు పోషకాహారం, విటమిన్ ట్యాబ్‌లెట్ల పంపిణీ

ఎస్సీ వర్గీకరణ తీర్పును ఉపసంహరించుకోవాలి



ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాల సంఘాల నేతలు

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ కన్వీనర్ మన్నె శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో లోయర్‌ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. ఎస్సీ కులగణన చేపట్టకుండా తీర్పు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణపై ఆర్డినెన్స్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. వర్గీకరణపై వేసిన కమిటీలో మాల ప్రతినిధులకు చోటు కల్పించలేదని దానివల్ల మాలలకు ఒరిగేదేమీ లేదన్నారు. వెంటనే ఆ కమిటీని రద్దు చేయాలని వర్గీకరణపై సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జీతో జ్యూడీషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



శునకాలకు ఉచిత రేబిస్ టీకా ఇస్తున్న వైద్యులు

బంజారాహిల్స్: పెంపుడు జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ ఆత్మీయంగా ఉంటూ, వాటి ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. నారాయణగూడ ఎస్ఎస్‌వీహెచ్‌లో వరల్డ్ రేబిస్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు సోకే వ్యాధులపై అవగాహన ఉండాలని సూచించారు. ఏదైనా జబ్బు చేసిన వెంటనే తగ్గరలోని జంతు వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే రేబీస్ టీకాలను తప్పనిసరిగా పెంపుడు శునకాలకు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 100 శునకాలకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు. ఎస్ఎస్‌వీహెచ్ సూపరింటెండెంట్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అరవింద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.